నేడు స్వామివారికి భస్మాభిషేకం

మోతీనగర్: కార్తీక మాసం సందర్భంగా వీ రామారావునగర్‌లోని శ్రీ వినాయక శివపార్వతుల ప్రసన్నాంజనేయ నవగ్రహ నాగదేవత ఆలయంలో ఈనెల 25న సాయంత్రం 5 గంటలకు స్వామివారికి భస్మాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ పురోహితుడు శ్రీకాంత్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పాల్గొనే భక్తులు తమ పేర్లను, గోత్ర నామాలను నమోదు చేసుకోవాలని సూచించారు. సాయంత్రం 5 నుంచి 6.30 గంటలకు ఆకాశ దీపారాధన, రాత్రి 8 గంటలకు అన్నదానం ఉంటుందని భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు


సామూహిక వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

ఓల్డ్‌బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ లాస్ట్ బస్టాప్ దగ్గరలోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం భక్తులు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను ఆచరించారు. అనంతరం భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఎన్టీఆర్‌నగర్‌లో గ్యార్వీ వేడుకలు


పాల్గొన్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్‌గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ ఎల్లమ్మబండ ఎన్టీఆర్‌నగర్‌లో మైనార్టీ సోదరుల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన గ్యార్వీ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్ హాజరై ప్రత్యేక పూజలు చేసిన అనంతరం అన్న సమారాధన ప్రారంభించారు. కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, జిల్లా గణేశ్, జీ రవి, శివరాజ్ గౌడ్, మల్లేశ్, ఫారూఖ్, ఖలీం, నాగరాజు, సాయి, శివ, బషీర్, మజర్, వెంకట కృష్ణ, రాజు పాల్గొన్నారు.

'మహా' గెలుపుపై బీజేపీ శ్రేణుల సంబరాలు


సంబరాలు చేసుకుంటున్న నాయకులు

మోతీనగర్: మహారాష్ట్ర ఎన్నికల్లో ఎన్డీయే గెలుపొందడంపై బీజేపీ సీనియర్ నాయకుడు నార్లపురం శ్రీనివాస్ ఆధ్వర్యంలో అల్లాపూర్ డివిజన్‌లోని శ్రీ వివేకానందనగర్ చౌరస్తాలో పటాకులు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో తెలంగాణనూ బీజేపీ జెండా ఎగరవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసే బీజేపీకి ప్రజలు పట్టం కడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శి గోనెల సుందర్శన్‌ముదిరాజ్, మాజీ కార్యదర్శి సీహెచ్ వెంకటరామిరెడ్డి, అల్లాపూర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి బందు హరికృష్ణ, బూత్ అధ్యక్షుడు వెంకట రామిరెడ్డి, నాయకులు నాగరాజు గౌడ్, మురళి, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

మూడో మహాసభలను జయప్రదం చేయండి


కరపత్రాలు పంపిణీ చేస్తూ విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

ఆల్విన్‌కాలనీ: నిజాంపేట్ ప్రగతినగర్ లీలా సుందరయ్య ఫంక్షన్ హాల్‌లో డిసెంబర్ 7,8 వ తేదీల్లో నిర్వహించనున్న మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా మూడో మహాసభలను జయప్రదం చేయాలని కూకట్‌పల్లి సీపీఎం మండల కార్యదర్శి ఎం శంకర్, కార్యదర్శి పీ ధర్మారావు, సభ్యులు కే నర్సమ్మ, కాసిం కోరారు.ఈ మేరకు హనుమాన్‌నగర్ బస్తీలో ఆదివారం ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేస్తూ విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ ఆధ్వర్యంలో ప్రతి మూడేళ్లకు ఒకసారి మహాసభల్లో చేపట్టిన కార్యక్రమాలను సమీక్షించుకుని భవిష్యత్ ప్రణాళికలు రూపొందించుకుని ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేసేందుకు ఈ మహా సభలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై మరిన్ని పోరాటాలు చేసేందుకు ఆర్థిక సాయం అందించాలని వారు కోరారు. కార్యక్రమంలో అశోక్, మల్లేశ్, యాదగిరి, మల్లేశ్వరి, పద్మ, శివలీల, హారిక, శేషమ్మ తదితరులు పాల్గొన్నారు.

కుమారుల వేధింపుల నుంచి కాపాడండి



దుండిగల్: ఆస్తి కోసం కుమారులు వేధిస్తున్నారని, వారి బారి నుంచి కాపాడాలని కోరుతూ ఓ వృద్ధుడు హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా ప్రతినిధులను ఆశ్రయించాడు. వివరాల్లోకి వెళ్తే.. దుండిగల్‌కు చెందిన వృద్ధుడు కొత్తపేట శంకరయ్య (94)కు మల్లేశ్, నగేశ్ ఇద్దరు కుమారులు ఉన్నారు. వయో భారంతో ఇంటి వద్దే ఉంటున్న శంకరయ్య, అతని భార్యను వేధింపులకు గురి చేస్తున్నారు. తన ఆస్తిని తీసుకున్న కుమారులు హత్య చేసేందుకు యత్నించారని, తిండి పెట్టకుండా చిత్ర హింసలకు గురి చేస్తున్నారని ఆరోపిస్తూ మేడ్చల్ జిల్లా హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ మౌనికను ఆదివారం కలిసి విన్నవించారు. స్పందించిన మౌనిక ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని హామీనిచ్చారు.

వన భోజనాల సందడి

కార్తీక మాసం సందర్భంగా ఆయా కులస్తుల ఆధ్వర్యంలో నిర్వహణ


పటేల్‌కుంట పార్కు వద్ద వన భోజనాలకు హాజరైన ఎమ్మెల్యే గాంధీ, గవర కులస్తులు


వీర శైవ లింగాయత్ సమాజం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, తదితరులు

కూకట్‌పల్లి: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని కూకట్‌పల్లి నియోజకవర్గంలోని పలు కుల సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం వన భోజనాల కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. పలువురు ఎమ్మెల్యేలు, నాయకులు ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సామూహిక పూజలు, వ్రతాలు చేశారు.

ఆల్విన్‌కాలనీ: కార్తీక మాసం సందర్భంగా గవర కులస్తుల వన సమారాధన, ఆత్మీయ కలయిక కార్యక్రమాన్ని పటేల్ కుంట పార్కు వద్ద ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ, ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్, మాజీ న్యాయమూర్తి వేగి సూర్య అప్పారావు, పారిశ్రామికవేత్త ఆదారి సత్యనారాయణ హాజరయ్యారు. కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, గవర సంఘం అధ్యక్షుడు దాడి శ్రీను, ప్రధాన కార్యదర్శి సూరిశెట్టి వెంకటేశ్వరరావు, షౌకత్ అలీ మున్నా, మజర్ తదితరులు పాల్గొన్నారు.


వీర శైవ లింగాయత్‌లు..


కాపు వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ..



గౌడ కులస్తుల ఆధ్వర్యంలో..


ఆర్యవైశ్య సంఘం, వాసవీకన్యకా పరమేశ్వరి ఆలయం ఆధ్వర్యంలో..

వీర శై లింగాయత్ సమాజం ఆధ్వర్యంలో..

వీర శైవ లింగాయత్ సమాజం ఆధ్వర్యంలో కూకట్‌పల్లి పాత శివాలయంలో వన భోజనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమా మహేశ్వర వ్రతాలు, శేషాద్రినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు ఏర్పాటు చేసిన వన భోజన కార్యక్రమంలో పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు హాజరయ్యారు.

కాపు వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

కేపీహెచ్‌బీకాలనీలోని భువన విజయం గ్రౌండ్‌లో కూకట్‌పల్లి కాపు వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్తీక వనభోజన కార్యక్రమం నిర్వహించారు. టీపీసీసీ ఓబీసీ వర్కింగ్ చైర్మన్ తూము వినయ్ కుమార్, బీసీ జర్నలిస్టు ఫోరం అధ్యక్షుడు తెల్ల హరికృష్ణ, సినీ యాక్టర్ హేమ, వినోద్, బొశెట్టి నర్సింగ్‌రావు, తూము సంతోష్, జై.సంతోష్, జీ అవినాష్ కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాపు సంఘం నాయకులు, పెద్దలు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య, వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం ఆధ్వర్యంలో..

కేపీహెచ్‌బీకాలనీ: కూకట్‌పల్లి మండల ఆర్యవైశ్య సంఘం, వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం ఆధ్వర్యంలో కార్తీక మాస వనభోజనాలను దీప్తిశ్రీ నగర్‌లోని ధర్మపురి క్షేత్రంలో నిర్వహించారు. ప్రముఖ వ్యాపారవేత్త బండారు సుబ్బారావు, ఆలయ ఫౌండర్ చెరుకు కుమారస్వామి, కూకట్‌పల్లి మండల అధ్యక్షుడు పుల్లయ్య, అడ్వయిజర్ చంద్రశేఖర్, శ్రీనివాస్, వెంకటరమణ, ఆర్యవైశ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి కౌండిన్య (గౌడ) సేవా సమితి ఆధ్వర్యంలో..

కూకట్‌పల్లి కౌండిన్య (గౌడ) సేవా సమితి ఆధ్వర్యంలో చిత్తారమ్మ ఆలయం ప్రాంగణంలో కార్తీక వన భోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై దీపారాధన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో యువ నేత దొడ్ల రామకృష్ణగౌడ్, పీ గాంధీ, ఉబ్బారావు, పీ మురళీకృష్ణ, మునేశ్వరరావు, డడీ విష్ణు మూర్తి, వెంకటేశ్వరరావు, శ్రీధర్, వీ శ్రీనివాస్, సత్యం బాబు, పోతురాజు, సుబ్బారావు, ఏకాంత్ గౌడ్, విద్యాకల్పన తదితరులు పాల్గొన్నారు.

యాదవుల సంఘం ఆధ్వర్యంలో..

కేపీహెచ్‌బీకాలనీలోని గోవర్ధన గిరి కృష్ణ ఆలయంలో యాదవుల కులస్తుల వన భోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాజీ న్యాయమూర్తి రాజయ్య, జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి, ఏసీపీ జానకీరామ్, రామస్వామి, బాలకృష్ణ, శ్రీనివాస్ యాదవ్, భేరి రామచంద్రా యాదవ్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో యాదవ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


యాదవుల సంఘం..



బాలానగర్ మండల కాపు సేవా సమితి ..


పద్మనాయక వెలమ సంఘం ఆధ్వర్యంలో..

బీజేపీ కార్యాలయంలో సన్నాహక సమావేశం


సమావేశంలో పాల్గొన్న రాజేశ్వరరావు, సూర్యరావు, సూర్యప్రకాశ్‌రావు తదితరులు

కూకట్‌పల్లి: కాంగ్రెస్ ఏడాది పాలన వైఫల్యాలను ఎండగడుతూ డిసెంబర్ 1 నుంచి 5 వరకు చేపట్టనున్న పాదయాత్ర సన్నాహక సమావేశాన్ని కూకట్‌పల్లి నియోజకవర్గ యాత్ర ప్రాముఖ్ వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మేడ్చల్ జిల్లా యాత్ర ప్రాముఖ్ అర్సనపల్లి సూర్యరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాయినేని సూర్యప్రకాశ్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా సూర్యరావు మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను పూర్తిగా అమలుచేయకుండా రాష్ట్ర ప్రభుత్వం విజయోత్సవాలకు సిద్ధం కావడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల్లో విశ్వాసం కోల్పోతుందని, దానికి ఉదాహరణ మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలేనని పేర్కొన్నారు. ఇకనైనా హామీలు అమలు చేయాలని లేకుంటే రానున్న రోజుల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా చేపడుతున్న కార్యక్రమంలో కార్యకర్తలు ప్రతిఒక్కరూ పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు, జిల్లా ఎన్నికల సహాయ అధికారి శ్రీధర్, జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి శంకర్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్‌రావు, మూసాపేట డివిజన్ కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పడిపూజలో ఎమ్మెల్సీ కవిత

కీసర: దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని కుందనపల్లి ప్రజాసాయిగార్డెన్‌లో నివాసం ఉంటున్న ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జాగృతి నాయకుడు విజయేందర్ గురుస్వామి ఆదివారం నిర్వహించిన అయ్యప్ప స్వామి మహా పడిపూజకు ఎమ్మెల్సీ కవిత హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పూజకు హాజరై స్వామిని దర్శించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.



వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కార్పొరేటర్ సబిహా బేగం


కంటి పరీక్షలు చేయించుకుంటున్న కార్పొరేటర్ నర్సింహాయాదవ్

మోతీనగర్: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహా బేగం సూచించారు. అల్లాపూర్ డివిజన్ తార్‌నగర్‌లో సింధు హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు పలువురికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో సఫ్దార్ నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మహమ్మద్ అబ్దుల్ అమీద్, ప్రధాన కార్యదర్శి సలీం, నాయకులు మహమ్మద్ రఫీ, గౌసుద్దీన్, వైద్యులు పాల్గొన్నారు.

అలీ కాంప్లెక్స్ దగ్గర..

ఓల్డ్ బోయిన్‌పల్లి: న్యూరిలయన్స్ కేర్ ఫార్మసీ అండ్ క్లీనిక్, టీఎక్స్ హాస్పిటల్, ఐకానిక్ ఐ కేర్ సంయుక్త ఆధ్వర్యంలో అలీ కాంప్లెక్స్ దగ్గర ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ ముద్దం నర్సింహాయాదవ్ ప్రారంభించారు. అనంతరం పరీక్షలు చేయించుకున్నారు. అలాగే డాక్టర్లు రోగులకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించి అవసరమున్నవారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్లు మహమ్మద్, వాజీద్, మహమ్మద్ ఇక్బాల్, యాసిన్, హైమద్, షాబజ్ ఫైయిమ్‌తో పాటు నాయకులు కర్రె జంగయ్య, సయ్యద్ ఏజాజ్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.


మందులు అందజేస్తున్న కార్పొరేటర్, డాక్టర్లు

ఏకరూప దుస్తులు కుట్టిన మహిళలకు

డబ్బులు అందేనా..?

- పెద్ద ఎత్తున పేరుకుపోయిన బకాయిలు
- ఈ విద్యా సంవత్సరంలో దుస్తులు కుట్టి ఇచ్చిన మహిళా సంఘాలు
- 507 ప్రభుత్వ బడుల్లోని 89,565 మంది విద్యార్థులకు దుస్తుల పంపిణీ
- పాఠశాలల ప్రారంభంలోనే యూనిఫామ్‌ల అందజేత

సాక్షి,సిటీబ్యూరో: ఏకరూప దుస్తులు కుట్టిన మహిళా సంఘాల సభ్యులకు నెలలు గడిచినా కూలి డబ్బులు చెల్లించకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డీఆర్డీఏ) ఉరుకులు, పరుగులతో రాత్రింబవళ్లు శ్రమించి సకాలంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఏకరూప దుస్తులు (యూనిఫామ్స్) అందించామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది విద్యాసంవత్సరం ప్రారంభంలోనే విద్యార్థులకు ఏకరూప దుస్తులు ఇవ్వాలని ప్రభుత్వం భావించింది. ఈ నేపథ్యంలోనే విద్యార్థుల యూనిఫామ్‌లకు అవసరమైన వస్త్రాన్ని జిల్లాలకు ప్రభుత్వం సరఫరా చేసింది. అలాగే, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) అధికారులకు విద్యార్థుల ఏకరూప దుస్తులు కుట్టించే బాధ్యతను అప్పగించారు. విద్యార్థుల ఏకరూప దుస్తులు మహిళా సంఘాల సభ్యులు కుట్టేలా డీఆర్‌డీఏ అధికారులు చర్యలు తీసుకోగా, వారు రాత్రింబవళ్లు కష్టపడి సకాలంలో పూర్తి చేశారు. దుస్తులు కుట్టి నెలలు గడిచినా ఇప్పటి వరకు కూలి డబ్బులు చెల్లించకపోవడంతో మహిళా సంఘాల సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

23 కుట్టు సెంటర్లు.. 1200 మంది మహిళలు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 507 ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి 89,565 మంది విద్యార్థులకు రెండు జతలు ఏకరూప దుస్తులు కుట్టించేందుకు సరిపడా వస్త్రాన్ని ప్రభుత్వం సరఫరా చేసింది. ఈ దుస్తులను సకాలంలో కుట్టేందుకు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ వివిధ ప్రాంతాల్లో 23 కుట్టు కేంద్రాలను ఏర్పాటు చేసింది. దుస్తులను కుట్టేందుకు ప్రభుత్వం తక్కువ ధర (కూలి) నిర్ణయించడంతో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ మహిళా సంఘాలకు అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఈ నేపథ్యంలోనే ఏకరూప దుస్తులు కుట్టేందుకు 23 కేంద్రాల్లో 1200 మంది మహిళలు ముందుకు వచ్చి.. లక్ష్యానికి అనుగుణంగా ఏకరూప దుస్తులు కుట్టారు. ఒక్కొక్క జతకు మహిళా సంఘాలు (కేంద్రం నిర్వాహకులు) రూ.50లు, రాష్ట్ర ప్రభుత్వ తరపున రూ.25లు కలిపి మొత్తంగా రూ.75 చెల్లించాల్సి ఉంది. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వరంలో మొదటి విడతగా ఏకరూప దుస్తులు కుట్టిన మహిళలకు ఇప్పటి వరకు రూ.44,39,550 మాత్రమే చెల్లించారు.

సకాలంలో డబ్బులు అందక..

ఆర్థిక సాధికారత పొందేలా విద్యార్థులకు యూనిఫామ్ కుట్టే బాధ్యతను మహిళా సంఘాలకు అప్పగించినా, ప్రభుత్వం వారికి కూలి డబ్బులను సకాలంలో చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏకరూప దుస్తుల(యూనిఫామ్) కూలి డబ్బులకు సంబంధించి మహిళా సంఘాల సభ్యులకు ఇంకా బకాయిలు రూ.88,55,700 చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా సర్కారు దుస్తులను పంపిణీ చేస్తుండగా, వాటిని కుట్టే బాధ్యతలను మహిళా సభ్యులకు అప్పగించారు. జిల్లాలోని 507 ప్రభుత్వ పాఠశాలల్లో 89,565 విద్యార్థులు చదువుతుండగా, ఇందులో బాలురు 44,184 మంది బాలికలు 45,381 మంది ఉన్నారు. విద్యార్థుల యూనిఫామ్‌లకు అవసరమైన క్లాత్‌ను (వస్త్రాన్ని)ప్రభుత్వం కొనుగోలు చేయగా, టెస్కో ద్వారా మహిళా సంఘాలకు సరఫరా చేశారు. విద్యార్థులకు సరిపడా క్లాత్ 1,81,719 మీటర్లు 144 మహిళా సంఘాల్లో టైలర్ పని చేసే 1200 మంది మహిళా సభ్యులకు అందజేయగా, వారు కుట్టారు.

మహిళలు కుట్టిన డ్రెస్ డిజైన్ ఇలా..

ఒకటి నుంచి మూడో తరగతి వరకు బాలికలకు ఫ్రాక్‌తో కూడిన యూనిఫామ్, 4, 5 తరగతుల బాలికలకు స్కర్ట్, 6 నుంచి 10 తరగతి చదువుతున్న బాలికలకు పంజాబీ డ్రెస్‌తోపాటు వాస్కోటును ఆకర్షణీయంగా మహిళా సంఘాల సభ్యులు డిజైన్ చేసి కుట్టారు. ఒకటి నుంచి ఏడో తరగతి వరకు చదువుతున్న బాలురకు రెడ్, యాష్ కలర్ చెక్స్ ప్రింటింగ్ షర్ట్, మెరూన్ కలర్ నిక్కర్, 8 నుంచి 10వ తరగతి చదువుతున్న బాలురకు షర్ట్, ప్యాంట్ అందించారు.